హైడ్రా చైర్మన్‌గా సీఎం రేవంత్

- ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు
- 15మంది ఉన్నతాధికారులతో సబ్ కమిటీ
- హైడ్రా పర్యవేక్షణలో అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ సపోర్ట్‌వింగ్‌ల స్థాపన
- తాజాగా రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం జీవో 99 జారీ చేసింది. జీహెచ్ఎంసీ తోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలను కలుపుకొని ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా ఏర్పాటు చేసింది. ఓఆర్ఆర్ దాకా హైడ్రాకు అధికార పరిధిని అప్పగించింది. హైడ్రా చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. జీహెచ్ఎంసీ చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 మేజర్ గ్రామ పంచాయతీలు హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతాయి.

ఇవీ విధులు

ప్రణాళిక, నిర్వహణ, సమన్వయం, కార్యాచరణ అమలు కోసం ప్రత్యేక ఏజెన్సీగా హైడ్రా ఉంటుంది. టీసీయూఆర్ ప్రాంతంలో ఏదైనా విపత్తు తలెత్తితే వెంటనే రెస్క్యూ కార్యకలాపాల కోసం సిద్ధంగా ఉండాలి. విపత్తు నిర్వహణ బాధ్యతలను హైడ్రా కమిషనర్ నిర్వర్తిస్తారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి మార్గదర్శకంలో కమిషనర్ నేతృత్వంలో పనిచేసేలా హైడ్రాకు ప్రత్యేక హెచ్‌వోడీ ఉంటారు. జీహెచ్ఎంసీ, అన్ని యూఎల్‌బీ, ఆర్ఎల్‌బీలు కలుపుకొని ఓఆర్ఆర్ పరిధి వరకు హైడ్రా పర్యవేక్షిస్తుంది. అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ సపోర్ట్ వింగ్‌లు హైడ్రా ఆధ్వర్యంలో పనిచేస్తాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ, ఈవీడీఎం పరిధిలో ఉన్న అధికారయంత్రాంగం, సిబ్బంది, మౌలిక సదుపాయాలు, వాహనాలు మొదలైనవి హైడ్రాలో భాగమై ఉంటాయి. అంతర్గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు జీహెచ్ఎంసీ వద్దే ఉంటాయి. పోస్టులు, సిబ్బంది, వాహనాలు, ఇతర అవసరాలకు బడ్జెట్ ప్రతిపాదనలను హైడ్రా కమిషనర్ సమర్పించాలి. హైడ్రా కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జీవోలో వెల్లడించారు.

12 మందితో పాలకమండలి

హైడ్రా పాలకమండలి చైర్మన్‌గా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఎంఏయూడీ మినిస్టర్ హోదాలో సభ్యుడిగానూ రేవంత్‌రెడ్డి ఉంటారు. రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మినిస్టర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, చీఫ్ సెక్రటరీ, డీజీపీ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెడ్ సభ్యులుగా ఉంటారు. హైడ్రా కమిషనర్‌గా నియమించిన ఐపీఎస్ ఆఫీసర్ ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

15 మందితో సబ్ కమిటీ

ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా ఏర్పాటు చేసున్నట్టు 99 జీవోలో పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్-2005 ప్రకారం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీ పేరుతో 15 మంది అధికారులతో కూడిన ఇంకో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా ఉంటారు. హైడ్రా కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పీసీసీఎఫ్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీ, ఫైర్ సర్వీసెస్ డీజీ, మెట్రో వాటర్, సీవరేజీ బోర్డు ఎండీ, హెచ్ఎండీఏ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్, మెట్రో రైల్ ఎండీ, ఎస్సీడీసీఎల్ ఎండీ, పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ, టీసీయూఆర్ పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. ఈ సబ్ కమిటీ చైర్మన్ సమాయానుకూలంగా ఇతర సభ్యులను నామినేట్ చేస్తారని జీవోలో పేర్కొన్నారు. టీక్యూర్ సబ్ కమిటీ పాలకమండలికి సహాయ సహకారాలు అందిస్తుంది. విపత్తు నిర్వహణ, ప్రణాళికలు, విధివిధానాలను అమలుచేయడంలో ఒక పాలకమండలి తరహాలో వ్యవహరించనున్నది. కాగా ఈ పాలకమండలిలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల మేయర్లు, చైర్మన్లు, సర్పంచులకు చోటు దక్కలేదు.

మ్యానిఫెస్టోను తప్పక అమలుచేస్తాం

ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జూలై 19: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టంచేశారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంగినేనిపల్లిలో రుణమాఫీ సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఆర్థిక భారం ఉన్నప్పటికీ అర్హులకు రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహజ్యోతి, రూ.500కే సిలిండర్ పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. గ్రామంలో ఇండ్లు లేని పేదలను గుర్తించి మెదటి విడతలో 50 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరుచేస్తామని భరోసా ఇచ్చారు.

ఫిషరీస్ కోర్సుల్లో తెలంగాణకు అన్యాయం

- పీహెచ్‌డీ లేకున్నా అవకాశం ఇవ్వాలి
- గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): వెటర్నరీ యూనివర్సిటీలో చేపట్టే ఒప్పంద నియామకాల్లో తెలంగాణ వారికే ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తాత్కాలిక అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీకి దేశవ్యాప్తంగా వెటర్నరీ, ఫిషరీస్ సైన్స్‌లలో పీజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థుల ఇంటర్వ్యూలు శుక్రవారంతో ముగిశాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక విద్యార్థులకు అక్కడ ఫిషరీస్ కోర్సుల్లో పీహెచ్‌డీ చదివే అవకాశం ఉండగా, తెలంగాణ అభ్యర్థులకు ఆ అవకాశం లేక పీజీతోనే సరిపెట్టుకుంటున్నారు. దీంతో ఆ పోస్టుల్లో (ఫిషరీస్ కోర్సులో) పీహెచ్‌డీ చేసిన తెలంగాణేతర అభ్యర్థులను భర్తీ చేసే అవకాశం ఉందని ఇంటర్వ్యూకు హాజరైన తెలంగాణ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోస్టుల్లో తెలంగాణ ప్రాంతం వారికి అవకాశం ఇవ్వాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రుణమాఫీని ప్రజలు నమ్మలే

- అందుకే ఎక్కువ ఎంపీ సీట్లు గెలువలేకపోయాం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎంపీ మల్లు రవి వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చెప్పినా ప్రజలు నమ్మకపోవడం వల్లే ఎక్కువ ఎంపీ సీట్లు గెలువలేకపోయామని నాగర్‌కర్నూల్ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఎంపీలు బలరాం నాయక్, రఘురాంరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పినా ప్రజలు నమ్మకపోవడం వల్ల తాము టార్గెట్‌గా పెట్టుకున్న 14 ఎంపీ సీట్లు గెలువలేకపోయామని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్ట్ 15 లోపు 2 లక్షల రుణమాఫీ చేసి చూపించబోతున్నారని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత అప్పుడు యూపీఏ ప్రభుత్వంలో ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దక్కితే, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి దక్కిందని తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని రాహుల్‌గాంధీని కోరుతామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, మిగతా బీజేపీ ఎంపీలు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

రేవంత్, భట్టి వెళ్తే అందరూ వెళ్లినట్టే..

రుణమాఫీ హామీని నిలబెట్టుకున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించబోయే బహిరంగ సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లనున్నట్టు మల్లు రవి తెలిపారు. వారిద్దరూ వెళ్లి రాహుల్‌తో మాట్లాడితే మిగతా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వెళ్లినట్టేనని చెప్పారు. త్వరలో రైతు భరోసాను అమలు చేసేందుకు భట్టి ఆధ్వర్యంలో సబ్ కమిటీ కసరత్తు చేస్తున్నదని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌కు ఎంపీ బలరాంనాయక్ సవాల్ విసిరారు.

'అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి'

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్‌శర్మ, జనరల్ సెక్రటరీ ఆనంద్‌శర్మ, ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరు శ్రీనివాస్‌రావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అర్చకుల బదిలీలు చేయకూడదని కోరారు. స్థానికంగా ప్రతి దేవాలయంలో ఆచారాలు, పద్ధతులు ఉంటాయని తెలిపారు. ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నవారిని బదిలీ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం అర్చక బదిలీలను నిలిపివేయాలని సెక్రటరీ శేషాద్రికి ఆదేశాలు ఇచ్చినట్లు ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. దేవాదాయశాఖలో ఐదేండ్లకు పైగా పనిచేస్తున్న అర్చక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈఏఎఫ్ ద్వారా వేతనాలు అందించాలని, పదవీ విరమణ తర్వాత పింఛన్, హెల్త్‌కార్డులు అందజేయాలని డీవీఆర్‌శర్మ, ఆనంద్‌శర్మ కోరారు.

ఉపాధి లక్ష్యంగా స్కిల్స్ యూనివర్సిటీ

- 17 కోర్సులు, ఏటా 20 వేల మందికి శిక్షణ
- స్కిల్స్ వర్సిటీపై సీఎం సమీక్ష

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

17 ప్రాధాన్య రంగాలు

కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్లో) స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పనున్నారు. మూడు, నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు. పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేశారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్ ఇలా 17 ప్రాధాన్య రంగాలున్నాయి. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.

డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపై దృష్టి

ఫార్మా కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి,సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

3 వరకు అంగన్‌వాడీ కేంద్రంలోనే..

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌తో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లకు సంబంధించిన ఆర్కిటెక్ట్స్, విద్యాశాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్లేస్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే విద్యాబోధన చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశానికి దిశానిర్దేశం చేశారు. 4వ తరగతి నుంచి సెమీరెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకునేలా, గ్రామాల నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు వెళ్లేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

- ఇసుక రీచ్‌లలో అక్రమ వసూళ్లు

ఇసుక రీచ్‌ల వద్ద కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలంగాణ స్టేట్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్‌కు ఫిర్యాదు చేసింది. ఉపాధ్యక్షుడు యాదయ్య, సభ్యులు యాదగిరి, చంద్రయ్య, లింగన్న, వెంకటేశ్, చంద్రం, శేఖర్, రమేశ్, వెంకటేశ్ ఉన్నారు- హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)

ఏఎంసీ పాలకవర్గాల నియామకం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు నూతన చైర్మన్, వైఎస్ చైర్మన్లతో పాటు పాలకవర్గాలను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా చేర్యాల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్‌గా నల్లనగుల్ల శ్వేత, వైస్ చైర్మన్‌గా కమిడి జీవన్‌రెడ్డి, వనపర్తి రోడ్డు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి, దేవరకద్ర అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కటలప్ప, వైస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి, చొప్పదండి అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్‌గా మునిగాల రాజేందర్‌తో పాటు పాలకవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 19 అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్టు తెలిపారు. మిగిలిన మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను త్వరలోనే నియమిస్తామని చెప్పారు.

'రేవంత్'కు క్షీరాభిషేకాన్ని అడ్డుకున్న అభ్యర్థులు

- తోకముడిచిన కాంగ్రెస్ కార్యకర్తల బృందం
- ఆర్ట్స్ కాలేజీ వద్ద తూతూమంత్రంగా కార్యక్రమం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: గ్రూప్ 2 పరీక్షల వాయిదాతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయతలపెట్టిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఉస్మానియా యూనివర్సిటీలో చుక్కెదురైంది. ఆ కార్యక్రమాన్ని డీఎస్సీ అభ్యర్థులు అడ్డుకోవడంతో మెయిన్ లైబ్రరీ ప్రాంగణం నుంచి ఆ బృందం తోకముడిచింది. దీంతో ఓయూలో ఉద్రిక్తత నెలకొన్నది. నిరుద్యోగుల డిమాండ్ మేరకు గ్రూప్ 2 పరీక్షను డిసెంబర్‌కు వాయిదా వేయడంతో టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఓయూ మెయిన్ లైబ్రరీ ఎదుట రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయతలపెట్టారు. అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయంలోకి వచ్చి విద్యార్థులను రావాలని కోరగా వారంతా తిరగబడ్డారు. తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఆందోళన చేస్తే పోలీసులను ప్రయోగించి, బలవంతంగా అణచివేయాలని ప్రయత్నించడం దారుణమని దుయ్యబట్టారు. అటువంటి సీఎంకు క్షీరాభిషేకం కార్యక్రమానికి తామెలా మద్దతిస్తామని తేల్చిచెప్పారు. కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించడంతో దయాకర్ బృందం అక్కడి నుంచి జారుకున్నది. ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాల ఆవరణలో తూతూమంత్రంగా రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని కార్మికుల పిల్లలకు ఈ ఏడాదికి స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీడీ, సినీ కార్మికులు, లైమ్‌స్టోన్, డోలమైట్, మైకా, ఐరన్‌ఓర్, మాంగనీస్ ఓర్, క్రోమ్ ఓర్ కార్మికుల పిల్లల నుంచి దరఖాస్తులు కోరారు. ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్ నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు https://scholarships. gov.in/ వెబ్‌సైట్‌ను, 01206619540 హెల్ప్‌లైన్ నంబర్, helpdesk@nsp.gov.inకు మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

డిసెంబర్‌లో గ్రూప్-2 పరీక్షలు

- వాయిదా వేస్తూ టీజీపీఎస్సీ ప్రకటన
- అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు
- పోస్టుల పెంపుపై స్పష్టతివ్వని సర్కారు



సచివాలయంలో గ్రూప్-2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల పోరాటాలకు ఎట్టకేలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేసింది. ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలను డిసెంబర్ నెలలో నిర్వహిస్తామని ప్రకటించింది. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నది. తిరిగి డిసెంబర్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 18 ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 29న ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆనాడు వివిధ కారణాలతో పరీక్షలు జరగలేదు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించడానికి టీజీపీఎస్సీ అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అనంతరం నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షల విషయంలో అస్పష్టత, ప్రభుత్వ నిర్లక్ష్యంపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 10 ప్రధాన డిమాండ్లతో వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారు. వాటిలో గ్రూప్ 2 వాయిదాపైనే స్పష్టత ఇచ్చి, గ్రూప్ 2 పోస్టుల పెంపును పట్టించుకోకపోవడంపై నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

గ్రూప్-2 అభ్యర్థులతో భట్టి చర్చలు

గ్రూప్ 2 వాయిదాపై అంతకు ముందు రాష్ట్ర సచివాలయంలో గ్రూప్-2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చర్చలు జరిపారు. నిరుద్యోగుల కోరిక మేరకు డిసెంబర్ చివరి వారానికి గ్రూప్-2 పరీక్ష వాయిదా అంశాన్ని పరిశీలించాలంటూ టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్‌లో సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు చెప్పిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగాల కోసం ఉద్యమాలు చేస్తూ, బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి ఆ తర్వాత కేసుల పాలైతే మీరే నష్టపోతారని చర్చల సందర్భంగా నిరుద్యోగులను హెచ్చరించారు. కొందరు స్వలాభం కోసం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందుల పాలు కావొద్దని కోరారు. మూడు నెలల్లోనే 54 వేల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఉద్యోగ ఖాళీలు వెతికి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. చర్చల్లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాంనాయక్, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు నిరుద్యోగుల ప్రతినిధులు లోకేశ్‌కుమార్ యాదవ్, సంజీవ్‌నాయక్, జనార్దన్ సహా మరో 50 మంది పాల్గొన్నారు.

గ్రూప్ 1పై మాట్లాడనివ్వని భట్టి

చర్చల సందర్భంగా గ్రూప్ 1 అంశాన్ని పట్టించుకోలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఆ విషయాన్ని లేవనెత్తితే భట్టి దానిని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రూప్ 2తోపాటు గ్రూప్ 3లో కూడా పోస్టుల సంఖ్యను తప్పక పెంచాలని, లేకుంటే ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని నిరుద్యోగులు స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క జరిపిన చర్చలు సంతృప్తిగా లేవని నిరుద్యోగులు చెప్పారు. ఉద్యమాన్ని నీరుగార్చడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన కొందరు నిరుద్యోగులను విడగొడుతున్నారని, తమలో తమకే గొడవలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోస్టుల సంఖ్య పెంచాల్సిందే

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయడం కంటే పోస్టుల సంఖ్య పెంచడమే ముఖ్యమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 2లో రెండు వేలు, గ్రూప్ 3లో మూడు వేల పోస్టుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు ఉద్యమాలు చేపడితే, కేవలం గ్రూప్ 2ను వాయిదా వేసి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. పోస్టుల పెంపు కోసం ప్రభుత్వంపై బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గ్రూప్ 2, 3 పరీక్షలను ఒకేసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌ది పటేల్ పాలన

- స్కాలర్లను వెటకారంతో చులకన చేస్తున్నారు
- ఉద్యోగార్థుల గోస పుచ్చుకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- గ్రూప్ 1లో 1:100 నిష్పత్తి పాటించాల్సిందే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో గాలి వినోద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఖైరతాబాద్, జూలై 19: సీఎం రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని, పటేల్ పాలన అని ప్రొఫెసర్ గాలి వినోద